## శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో రుద్రాభిషేకం

**నర్సాపూర్ మే 18 ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కేతకి భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆలయ నిర్మాణ దాత, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి కి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీ కేతకి భ్రమరాంబిక సైతం మల్లికార్జున స్వామి కి ప్రత్యేక పూజలు చేసి న అనంతరం రుద్రాభిషేకం, నమ్మకం చమకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణదాత బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరినీ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో చల్లంగా ఉంచాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ తో పాటు ఆలయ పూజారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## మండల పరిషత్‌లో పోస్టులు ఖాళీ

### -ఖాళీగా 4 పోస్టులు.. భర్తీ చేయాలని వేడుకోలు

**మనూర్, మే 18, ప్రభాతవార్త:** మండల ప్రజలు సమస్యలకు గురికాకుండా ఉండాలంటే మండల పరిషత్ కార్యాలయంలో అయా శాఖలకు అధికారులు విధులు నిర్వహిస్తూ ఉండాల్సిన అవసరం ఉంటుంది. మనూర్ మండల పరిషత్ కార్యాలయంలో మాత్రం ఎంపిడిఓతో పాటు సూపరింటిడెంట్, సీనియర్ అసిస్టెంట్, రెండు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంపిఓగా విధులు నిర్వహిస్తున్న హైమద్ హుస్సేన్‌కు ఇంచార్జి ఎంపిడిగా బాధ్యులు అప్పగించి ఉన్నతాధికారులు మమ అనిపించుకున్నారు. ఎంపిడి ఇంచార్జిగా ఉండటం, సూపరింటిడెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు రెండు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో మండల ప్రజలు ఏ మాత్రం సేవలు అందుకుంటున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనలేదు. జిల్లా కలెక్టర్ స్పందించి మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**కొల్చారం, మే 18,ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రజలందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నీ కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలోని పలు వార్డులు, ప్రసూతి విభాగం, వార్డుల్లో రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. పలువురు బాలింతలతో మాట్లాడారు. ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజర పట్టిక పరిశీలించారు. ప్రతి రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారని? గత నెలలో మొత్తం ఎంత మంది వచ్చారు? అని ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ మదన్ మోహన్, ఎంపిహెచ్‌ఈవో గ్లోరి ప్రియాంక, ఎమ్ఎల్పి ప్రవీణ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ తదితరులు ఉన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



న్యాయమూర్తి శ్రీసుధాకి మెమోంటోతోసత్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

**చిన్నకోడూరు, మే 18, ప్రభాతవార్త :** హైకోర్టు న్యాయమూర్తి పి. శ్రీసుధాను చిన్నకోడూరు మండల పరిధిలోని రంగనాయకసాగర్ అతిథి గృహంలో ఆదివారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శనివారం సరస్వతి నది పుష్కరాలకు కాళేశ్వరం వెళ్లిన న్యాయమూర్తి తిరిగి హైదారాబాద్ వెళ్తున్న క్రమంలో భోజనం చేసి కాసేపు విశ్రాంతి కోసం రంగనాయకసాగర్ అతిథిగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాలో న్యాయ విషయాలపై కాసేపు చర్చించారు. న్యాయమూర్తిని జిల్లా కలెక్టర్ మను చౌదరి శాలువాతో సత్కారించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి, ఆర్డీఓ సదానందం,ఏసీపీ మధు, తహశీల్దార్ హరి కిరణ్‌కుమార్, ఎస్ఐ బాలకృష్ణ, న్యాయ,రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రెండో రోజు ఘనంగా స్వామి వారి స్వర్ణోత్సవాలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



స్వామి వారి ఆలయంలో హోమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినీపూర శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ స్వర్ణోత్సవ, బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం వైనతేయ ఇష్టి(కాలసర్ప దోష నివారణ, సత్ సంతాంభివృద్ధి) హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. అనంతరం ధ్వజా రోహణం నిర్వహించారు. అంతకు ముందు విష్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, శాంతి పాఠం, ఆరణి మథనం, అగ్నిప్రతిష్ట కార్య క్రమాలు ఘనంగా నిర్వహించారు.సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం జరిగింది. స్వర్ణోత్సవాలన పురష్కరించుకొని శ్రీ త్రిదండి దేవనాథ్ చిన జీయర్ స్వామి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్ విష్ణు, కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ, డైరెక్టర్లు దాస శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్, బాలరాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్దయెత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు.

## అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

**సదాశివపేట, మే 18(ప్రభాతవార్త) :** పదవ తరగతి, ఇంటర్‌లో అత్య ధిక మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులకు పట్టణంలోని లోపలి కోట పద్మశాలి కులదైవం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేశారు. ఇంటర్ విద్యార్థులు గున్నాల సందీప్, నాగారం మైత్రి, మునిపల్లి శ్రీకర్, పదవ తరగతి విద్యార్థులు పోల మానస్, గున్నాల శరణ్యలకు పూల మాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశాలి కులదైవం అధ్య క్షుడు మునిపల్లి రామకృష్ణ మాట్లాడుతూ పద్మశాలి విద్యార్థులు చదువులో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్య క్రమంలో లోపలికోట హనుమాన్ మందిరం కమిటీ అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, కాశీనాథవ, గణేశం, మద్దెల రమేష్, హనుమాన్ మందిరం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**కొండాపూర్, మే 18,ప్రభాతవార్త:** మండలంలోని గంగారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ ఆదివారం మృతి చెందారు. మృతిపట్ల ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రేమ్‌కుమార్ అంత్రక్రియల్లో చింత ప్రభాకర్ తనయుడు చింత సాయి నాథ్ పాల్గొని పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రేమ్ కుమార్ మృతి చెందడం చాలా బాధాకరమని చింత సాయినాథ్ అన్నారు చింత సాయినాథ్ వెంట మండల పార్టీ అధ్యక్షులు విఠల్, మాజీ సర్పంచ్ నర్సింలు, అంజిరెడ్డి, ప్రభూ స్వామీ, పాండు, వివిధ గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు ఉన్నారు

# చదువు లేకుంటే జీవితానికి అర్థం లేదు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

విద్య ఉద్యోగం కోసం కాదని దేశం, సమాజం పట్ల బాధ్యత పెంచుతుందని..చదువు లేకుంటే జీవితానికి అర్థం లేదని మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు.జిల్లా కేంద్రంలోని గౌరీ నీలకంటేశ్వర స్వామి 34వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన స్వామి వారి కళ్యాణంలో ఆదివారం పాల్గొని టెన్త్,ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో ఆలయాన్ని సమాజాన్ని దిన దినాభివృద్ధి చేస్తున్న నీలకంత సమాజం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రథోత్సవం సందర్భంగా రథాన్ని అద్భుతంగా తయారు చేసిన శిల్పిని సన్మానం చేశారు. కార్యక్రమంలో నీలకంత సమాజం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి దీవెనలతో అన్నింటా దిగ్విజయం కావాలి**

అమ్మవారి దీవెనలతో అన్నింటా దిగ్విజయం కావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. నారాయణరావుపేట మండలం కోదండ రావుపల్లిలో ఆదివారం నిర్వహించిన పోచమ్మ దేవాలయం ఉత్సవాలలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎండ కాలం కూడా చెరువుల్లో, కుంటల్లో జల కళ ఉందన్నారు.10 యేండ్లలో ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశామని అమ్మవారి దీవెనలతో అన్నింటా మంచి జరగాలన్నారు. రూ.50 వేలు ఆలయ నిర్వహకులకు విరాళంగా అందించారు. అనంతరం ఆయనను గ్రామస్తులు, ఆలయ నిర్వహకులు ఘనంగా సత్కరించారు. ఆయన వెంట బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు ఉన్నారు.అనంతరం ఇబ్రహీంపూర్‌లో జరుగుతున్న శ్రీ పెద్దమ్మ దేవాలయ ఉత్సవాలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఇబ్రహీంపూర్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్నో దేశ విదేశాల నుంచి ఈ గ్రామ అభివృద్ధిని చూసి నేర్చుకున్నారని తెలిపారు. పెద్దమ్మ తల్లి అనుగ్రహం అందరిపై ఉండాలన్నారు.



పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న హరీష్‌రావు



జాతీయ స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన బివిఆర్ఐటి విద్యార్థులు

## జాతీయస్థాయి పోటీలలో విజేతలుగా బివిఆర్ఐటి విద్యార్థులు

**నర్సాపూర్, మే 18 ప్రభాతవార్త :** నర్సాపూర్ సమీపంలోని బి వి ఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ ఎల్ అండ్ టి టెక్నో జీఎం విద్యార్థి ప్రాజెక్టు పోటీల్లో విజేతలుగా నిలిచారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబేలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులో శనివారం నిర్వహించిన ఎల్ అండ్ టి టెక్నోజియం జాతీయస్థాయి విద్యా ప్రాజెక్టు జట్ల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నర్సాపూర్ బి వి ఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఎనిమిదవ జాతీయస్థాయి ఎల్ అండ్ టి టెక్నో జి యం పోటీలకు దేశవ్యాప్తంగా 569 విద్యాసంస్థల నుండి 4669 కాన్సెప్ లు సమర్పించి 40,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా 36 జట్లు ఫైనల్స్ కు చేరుకున్నాయని తెలిపారు. ఈ ఫైనల్స్ పోటీల్లో బి వి ఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు విద్యార్థి ప్రాజెక్టులకు అవార్డులు గెలుచుకున్నారని తెలిపారు. ఎల్ అండ్ టి టెక్నోజియం ఫైనల్ పోటీలలో ఈసీఈ విద్యార్థులు రెండవ రన్నర్ గా నిలిచారని పేర్కొన్నారు. రెండవ రన్నర్ గా గెలుపొంది అవార్డు గెలుసుకోవడమే కాకుండా మూడు లక్షల నగదు బహుమతిని అందుకున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కేవీ విష్ణు రాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలలో గెలుపొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ కళాశాలలో అధునాతన పద్ధతులు, నూతన ల్యాబ్ వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులు అధ్యాపకులు మంచి రీసర్చ్ పరిశోధనలు చేయడానికి ప్రోత్సాహం ఉందన్నారు. విద్యార్థులు ఈ విధంగా అభివృద్ధి చెందుతుంటే ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలలో విజేతలుగా గెలిచిన విద్యార్థులను శ్రీవిష్ణు విద్యాసంస్థల చైర్మన్ కె.వి విష్ణురాజుతోపాటు విభాగాధిపతులు అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు విద్యాసంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ఆదిత్య విస్సం, కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీమీప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దుబే, మేనేజర్ బాపిరాజు, ఏవో సురేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 21న కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

**నాగల్‌గిద్ద, మే 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కరస్‌గుత్తిలోని ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో ఈ నెల 21న 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సంలో విద్యను అందుకునేం దుకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రజ పేర్కొన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ఎంపిసి, బైపిసి సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటలకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తామని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఇంద్రజ వివరించారు.

## అలియన్స్ ఆధ్వర్యంలో పేద అమ్మాయి పెళ్లి

**సిద్దిపేట అర్బన్, మే 18, ప్రభాతవార్త :** అలియన్స్ క్లబ్స్ ఇంటర్నే షనల్ జిల్లా గవర్నర్ గందే ఈశ్వర్ చరణ్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణానికి చెందిన పేదఇంటి అమ్మాయి వివాహం ఆదివారం కోటిలింగాల దేవాలయం లో హిందూ సాంప్రదాయం ప్రకారం నిర్వహించి 350 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. పేదింటి అమ్మాయి పెళ్లి అలియన్స్ సభ్యుల సహాయ సహకారంతో నిర్వహించారు.ఇప్పటి వరకు అలియన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 10 పెళ్లిలు నిర్వహించినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ మంజుల, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మ రాములు, అంజయ్య, బాలచంద్రం, వైకుంఠం,అంతయ్య, జిల్లా ఆఫీసర్స్ పాల్గొన్నారు.





పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ స్వాములు

## హనుమాన్ స్వాముల పాదయాత్ర ప్రారంభం

### భజనలు, సంగీతంతో హోరెత్తిన సంబరం

సిద్దిపేట రూరల్, మే 18, ప్రభాతవార్త : భజనలు, భక్తి పాటలు..మంగళ హారతులతో హనుమాన్ స్వాముల పాదయాత్ర అంగరంగ వైభంగా ఆదివారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కోటిలింగాల దేవాలయం నుంచి కొండగట్టుకు వివిధ ప్రాంతాల నుంచి 100 మంది హనుమాన్ స్వాములు ఈ పాదయాత్రలో భక్తి భావంతో పాల్గొన్నారు. హనుమాన్ స్వామి సంగం మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో ప్రారంభమైన పాదయాత్రకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పాదయాత్రలో పాల్గొనే హనుమాన్ స్వాములకు ఆహారం,పండ్లు,నీళ్లు,వసతి సౌకర్యాలను మధుసూదన్‌రెడ్డి మిత్రుల సౌజన్యంతో సమకూర్చారు. ఆదివారం రాత్రి సిద్దిపేట సమీపంలోని పెద్దమ్మగుడి వద్ద స్వాములు నిద్రిస్తారు. సోమవారం ఉదయం నుంచి పాదయాత్ర మళ్లీ ప్రారంభం అవుతుంది. బుధవారం రాత్రి స్వాముల పాదయాత్ర కొండగట్టుకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా భజనలు,భక్తి గీతాలు, డీజే సంగీతం పాదయాత్రను ఉత్సాహభరితం చేసింది.

## కంగ్టి ఎస్ఐగా సిద్ధ దుర్గారెడ్డి

**నారాయనఖేడ్, మే 18 ప్రభాతవార్త :** కంగ్టి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా దుర్గా రెడ్డిని నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శనివారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన ఎస్ఐ విజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని వీఆర్కు బదిలీ అయ్యారు. అక్కడ వీఆర్‌గా ఉన్న దుర్గారెడ్డి బదిలీపై కంగ్టికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రత లను కాపాడేందుకు కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలని కోరారు.

## అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి కెసిఆర్ భరోసా

**మర్కుక్, మే 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవెల్లి కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో మాజీ సిఎం కెసిఆర్‌ను అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబసభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో ప్రాణాలను బలిదానం చేసిన కానిస్టేబుల్ కిష్టయ్య కుటుం బాన్ని కెసిఆర్ ఆదుకుంటున్న విషయం తెలిసిందే!. కిష్టయ్య కుమార్తె ప్రియాంక చదువుకు కెసిఆర్ ఆర్థికసాయం అందిస్తున్నారు. వైద్య విద్యలో ఆసక్తికనబరిచిన ప్రియాంకను ఎంబిబిఎస్ చదివించారు. పిజిచేస్తున్న డాక్టర్ ప్రియాంక చదువుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని ఆదివారం కెసిఆర్ కిష్టయ్య భార్య పిల్లలకు అందించారు. కిష్టయ్య కుమారుడు రాహుల్ వివాహం నిశ్చయమైన విషయాన్ని తెలుసుకున్న కెసిఆర్ సంతోషం వ్యక్తం చేశారు. కిష్టయ్య కటుంబానికి తన సంపూర్ణ సహకారం ఎప్పటికి ఉంటుందని కెసిఆర్ భరోసా ఇచ్చారు.



కెసిఆర్‌ను కలిసిన కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబీకులు



వనదుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు(ఇన్‌సెట్‌లో వనదుర్గామాత)

## కిటకిటలాడిన ఏడుపాయల

### బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కల చెల్లింపులు

**పాపన్నపేట,మే 18,ప్రభాతవార్త:** భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారు తల్లిగా విరాజిల్లుతున్న వనదుర్గ భవాని క్షేత్రం దుర్గమ్మకు జన హారతి పట్టారు. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పుణ్యక్షత్రం కిటకిటలాడింది. వేసవి సెలవులు, ఆదివారం సెలవు దినం కావడంతో సుధీర ప్రాంతాలనుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. వీరు మ్నాజీ రా నదిలోని వివిధ పాయల్లో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు , బోనాలు మొక్కలు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, శ్యాం, బత్తిని, నర్సింలు, రాజు, వరుణాచారి, తదితరులు ఏర్పాటు చేయగా వేదపండితులు శంకర శర్మ, పార్థివ శర్మ ,రాము శర్మ, నాగరాజు శర్మ తదితరులు పూజలు నిర్వహించారు, ఏడుపాయలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందో బస్త్ చర్యలు చేపట్టారు.

## పాఠశాలల మౌలిక సౌకర్యాలకు రూ. 30.80 లక్షలు మంజూరు

**హుస్నాబాద్ రూరల్, మే 18, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించేం దుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం రోజున జిల్లా డిఎమ్ఎఫ్‌టి నుండి రూ 30.80 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విడుదలైన నిధులతో హుస్నాబాద్ మండలంలోని పోతారం (ఎస్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంపౌండ్‌వాల్/టాయిలెట్స్ బ్లాక్ నిర్మాణంకు 16.80 లక్షలు, మండలంలోని తోటపల్లి గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ 14 లక్షలు కేటాయించినట్లు ఉత్తర్వూలో పెర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు చేయడం పట్ల మండల వాసులు హర్షం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## పేదింటి ఆడపడుచు పెళ్లికి పుస్తెలు, మెట్టెల బహూకరణ

**నర్సాపూర్ మే 18 ప్రభాతవార్త:** పేదింటి ఆడపడుచు పెళ్లికి మాజీ కౌన్సిలర్ ఎర్రగొల్ల లతారమేష్‌యాదవ్ పుస్తెలు,మెట్టలను బహూకరించారు. నర్సాపూర్ రెండవ వార్డుకు చెందిన కరణం మంజుల కృష్ణ దంపతుల కూతురు వివాహం ఆదివారం ఉండగా ఈ విషయాన్ని తెలుసుకున్న లతా రమేష్‌యాదవ్ వివాహానికి హాజరై పుస్తెలుమెట్టలను అందజేశారు. అంతేగాక ఇటీవల నర్సాపూర్ మున్సిపాలిటీలోని నాలుగవ వార్డుకు చెం దిన వడ్డే నరసయ్య కూతురు వివాహం ఈ నెల 15న జరుగగా వివాహ ఖర్చులకోసం 15 వేల విలువగల వస్తువులను అందజేశారు. లతా రమేష్ యాదవ్ ఆపదలో ఉన్నవారికి తన వంతు సహాయాన్ని అందించడం అభినందనీయమని పలువురు పట్టణవాసులు అన్నారు.

## తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

**పాపన్నపేట, మే 18, ప్రభాతవార్త:** తల్లిదండ్రుల నుంచి తప్పి పోయిన బాలుడిని, నీటమునిగిన బాలికను పోలీసులు రక్షించారు. ఈ సంఘటన మండల పరిధిలోని ఏడుపాయల క్షేత్రంలో ఆదివారం జరిగింది. మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏడుపాయల వనదుర్గ భవానిమాతను దర్శించుకునేం దుకు కామారెడ్డి జిల్లాలోని చింతపల్లి గ్రామానికి చెందిన నరేష్‌గౌడ్ కుటుంబసభ్యులతో కలిసి ఏడుపాయలకు చేరుకొని అమ్మవారిని దర్శించు కొని వస్తున్న క్రమంలో బాలుడు లలిత్‌గౌడ్(4) తల్లిదండ్రుల నుండి తప్పి పోయి రాజగోపురం వద్ద తచ్చాడుతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీసులు గమనించి బాలుడిని చేరదీసి వాకాడు చేయగా బాలుడు తప్పి పోయడనీ గమనించిన కుటుంబీకులు ఇఓ కార్యాలయం వద్ద చేరుకోగా బాలుడి తల్లిదండ్రులకు అప్పగించినట్లు వెల్లడించారు.

**నీట మునిగిన బాలికను కాపాడిన పోలీసులు...**

చెక్‌డ్యాం నీట మునిగిన బాలికను పోలీసులు కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక క్యార్టీ పోలీస్ ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ యాద గిరి, రాజేందర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా దుతూ ఏడుపాయల క్షేత్రం లో నీటి ప్రమాదాల నివారణకు గత ఏడాది జూన్ 24న ప్రత్యేక పోలీసుల గస్తీని ఏర్పాటు చేసి నీటి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించెప్పుడు నీటి లోతు తెలియక నీటి ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారని, దిన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## బైకును ఢీకొన్న ట్రాక్టర్. భార్యభర్తలకు గాయాలు

**అల్లాదుర్గం, మే 18, ప్రభాతవార్త:** 161వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో భార్యభర్తలు గాయ పడిన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిదిలోని గొల్లకుంట తండాకు చెందిన రాథోడ్ సురేష్ తన భార్యతో కలిసి అల్లాదుర్గం నుంచి గొల్లకుంట తండాకు ద్విచక్ర వాహనం పై వెళుతున్న క్రమంలో పెద్ద శంకరంపేట చికోడ్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కార్తీక్ జోగిపేట నుంచి పెద్ద శంకరంపేటకు వెళుతుండగా పోలీసు ఠాణా సమీపంలో 161 జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు భార్యభర్తలను చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కుక్కల దాడిలో గొర్రెల మృతి

**చిన్నశంకరంపేట, మే 18,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట శివారులోని వ్యవసాయ పొలం వద్ద ఉన్న గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 6 గొర్రెలను కొరికి చంపిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు, గొర్రెల యజమానిక తెలిపిన సిద్దెని నర్సింలు, దుర్గయ్యలు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధి కుర్మపల్లి గ్రామానికి చెందిన నర్సింలు, దుర్గయ్యల గొర్రెల మందపై ఉర కుక్కలు దాడి చేసి ఆరు గొర్రెలను కొరికి చంపివేశాయి. ఉదయం వచ్చి చూడగా గోర్రెలన్ని చెల్లా చెదురుగా పడి చనిపోయి ఉన్నాయి. ఈ సంఘటనలో సుమారుగా 60 వేల ఆస్తి నష్టం జరిగినట్లు గొర్రెల యజమానులు నర్సింలు, దుర్గయ్య తెలిపారు. గొర్రెల యజమానులు గొర్రెలు,మేకల కళేబరాలతో పరిశ్రమ గేటుముందు ఉంచి నిరసన తెలిపారు. పరిశ్రమ యజమాన్యం స్పందించి తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పరిసర ప్రాంతాలలో పరిశ్రమలు ఉండటంతో ఉర కుక్కలు కూడ ఎక్కువగా ఉన్నాయని, గత సంవత్సం నవంబర్‌లో కూడ 12 గొర్రెలపై దాడి చేసి చంపేశాయని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయంపై గ్రామా ధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైన గ్రామాధికారులు, పోలీసులు స్పందించి గ్రామాలలో స్వైర విహారం చేస్తూ గ్రామస్తులను భయబ్రాంతులకు గురి చేస్తున్న ఉర కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

# పేదవారికి కార్పొరేట్ విద్య, వైద్యం అందించాలి

### ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్

**కొల్చారం, మే 18, ప్రభాతవార్త:** పేదవారికి విద్య వైద్యం, పిరమైపోయింది దేశంలో 75 శాతం, పేదలే ఉన్నా వారికి కనీసం కార్పొరేట్ విద్య,వైద్యం అందడంలేదని ఎమ్మార్పిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 100కు 100 శాతం కార్పొరేట్ విద్య, వైద్యం ఉచి తంగా అందించాలన్నారు. పేదవాడు చదువుకోడానికి, విద్య వ్యాపారం అయిపోతుంది పేదోడు అనారోగ్యా నికి గురవుతే కార్పొరేట్ వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు, ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుం బీకులు వీధిన పడుతున్నారు. అందుకే రాష్ట్రంలో సిఎంఆర్ఎఫ్ ఇస్తున్నారని, లక్ష ఖర్చు అవుతే 40 శాతం మాత్రమే సీఎంఆర్ఎఫ్ క్రింద ఇస్తే, పేషెంట్ మందుగోలీలకు సరిపోవడం లేదు.జాతీయ పార్టీలు రాష్ట్ర పార్టీలు ఎన్నికల సమయంలో మీకు అన్ని విధాలుగా ఆదుకుంటామని మైకు పట్టుకొని ఒకరిని మించి ఒకరు భూమికి ఆకాశానికి అందని హామీలు ఇచ్చి, పేదోళ్ల ఓట్లను నమ్మించి పూర్తిగా దోచుకొని, సీటు మీదికిరాగానే ఇచ్చినా హామీలన్నీ గాల్లో కలిసి పోతున్నాయి.అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీ సం పేదోళ్లకు కార్పొరేట్ వైద్యం,విద్య అందించాలి, లేనట్లయితే ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తా మని హెచ్చరించారు. పేదవారికి ఎకరం భూమి లేదని, అందుకని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తక్షణమే పేదలను గుర్తించి, వారికి భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పేదోడు పేదోనిగనే ఉండిపోతుం దని, అభివృద్ధికై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముం దడుగు వేయాలన్నారు. దేశవ్యాప్తంగా రైతులకు రాయితీ మీద ఎరువులు అంచేయాలన్నారు. దేశ వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ పనులను రైతులు అను సాధనము చేసే రైతులను ఆదుకోవాలని, రైతులకు 90 శాతం రాయితీ ఇచ్చి రైతును రాజుగా చెయ్యా లని, దేశానికి రైతే వెన్నుముక్క రైతు లేకపోతే బతుకు లేదు, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.


రూప్లతండాలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

**సిర్గాపూర్, మే 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రూప్ల తండాలో కొనసాగుతున్న వైద్యశిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి సందర్శించారు. తండాలో చికున్‌గున్యా లక్షణాలతో తండా వాసులు అవస్థలుపడుతుండటంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచనల మేరకు తండాలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విధితమే. తండాలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ గాయత్రి దేవి సైతం పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి తండావాసులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తండా వాసులు భయపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. తండావాసులు పూర్తిగా కోలుకునేవరకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో తండా వాసులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపన


విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న భక్తులు

**గుమ్మడిదల మే 18(ప్రభాతవార్త) :** మండలం పరిధిలోని కొత్తపల్లిలో భక్తిశ్రద్ధలతో శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురోహితులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ఆలేటి జగన్మోహన్‌రెడ్డి, ఆలేటి వెంకట్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు విజయవంతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, లలిత నరసింహారెడ్డి, ఆంజనేయులు,రాజశేఖర్, వేణు, దేవేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, మంగయ్య, సదానందరెడ్డి, గోపాల్,సత్తయ్య, చక్రపాణి, నాగేష్ గౌడ్, వినోద్ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన్ ఎస్ఐ భూషణ్‌భారత్‌కు సన్మానం


నూతన ఎస్సైను సన్మానిస్తున్న మూడు చింతల నరేందర్‌రెడ్డి యువసేన

**గుమ్మడిదల మే 18 (ప్రభాతవార్త) :** గుమ్మడిదల మున్సిపాలిటీ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా వచ్చిన భూషణ్ భారత్‌ను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపిటిసి గోవర్ధన్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నరేందర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, జైశంకర్‌గౌడ్, ప్రకృతి నివాస్ కాలనీ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ బి.నర్సింలు, దర్గా వీరేష్, ఆకుల ఆంజనేయులు, రామగౌడ్, కె.రాజిరెడ్డి, కె.రవీందర్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎస్.యాదవ్, వినోద్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, గణేష్, నర్సింలు, మహేష్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఏక్తా యాత్రకు తరలివెళదాం


మాట్లాడుతున్న నాయకులు

**కోహెడ, మే 18, ప్రభాతవార్త :** కేంద్ర మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో ఈనెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే హిందూ ఏక్తాయాత్రకు మండలం నుంచి భారీగా తరలిరావాలని ఏక్తా యాత్ర మండల ఇంచార్జి పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కోహెడ మండల కేంద్రంలోని పూసల సంఘం భవనంలో బిజెపి మండల అధ్యక్షులు జాలిగం రమేష్ అధ్యక్షతన హిందూ ఏక్తాయాత్ర మండల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలంలోని 27 గ్రామాల పార్టీ శ్రేణులు బూతుకు 30మంది తగ్గకుండా హిందూ సమాజాన్ని ఏక్తాయాత్రకు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఏక్తామాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేంకటేశం, నర్సయ్య, చంద్రశేఖర్‌రెడ్డ, బాపురెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రజినీకాంత్‌రెడ్డి, జగన్, సతీష్, శ్రీకాంత్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్‌రావు, రంజిత్, రాములు,సాగర్, సుధాకర్‌చ, బాలయ్య, శ్రీపాల్, కరుణాకర్, లక్ష్మారెడ్డి, సంతప్‌రెడ్డి, పర్శరాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, మే 18, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీ బ్రహరాంబిక మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు శోభాయమానంగా నిర్వహించారు. ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలకు పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదర్శ్‌రెడ్డి వెంట జిన్నారం నాయకులు కొలను బాల్‌రెడ్డి, గుమ్మడిదల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని పూజలు చేస్తున్న ఆదర్శ్‌రెడ్డి

# ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటును నిలిపేయాలి



దీక్షలో పాల్గొన్న నాయకులు

**గుమ్మడిదల, మే 18(ప్రభాతవార్త) :** గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్(ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహారదీక్ష 103వ రోజుకు చేరుకుంది. ఈదీక్షకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మద్దతు తెలుపుతున్నారు. ఆదివారం దీక్షా శిబిరానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఎలాంటి ప్రాజెక్టు తీసుకొచ్చినప్పటికీ, అది ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం పర్యావరణానికి హానికరం కావడంతోపాటు, స్థానికుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డ్ కోసం పచ్చని అడవి, ప్రజల నివాస ప్రాంతాలను ఎంచుకోవడం అన్యాయమే కాకుండా, ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు 103 రోజులుగా శాంతియుతంగా తమ డిమాండ్లను చెప్పుకుంటూ దీక్షలో పాల్గొనడం ఎంతో అభినందనీయం. ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పందించి, ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షులు సదానంద రెడ్డి, దేవేందర్ రెడ్డి, సూర్యనారాయణ, చక్రపాణి, వినోద్‌గౌడ్, వెంకటేష్ యాదవ్ సంఘీభావం తెలిపారు.

# పెట్రోల్ ట్యాంకర్‌లో మంటలు..

## తృటిలో తప్పిన ప్రమాదం

**కుషాయిగూడ, మే 18,ప్రభాతవార్త:**

చర్లపల్లిలోని ఓ పెట్రోల్‌ట్యాంకర్‌లో చెలరేగిన మంటలను గమనించి డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఉండడంతో పదుల సంఖ్యలో ట్యాంకర్లు పెట్రోల్, డిజిల్ కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలోనే ఆదివారం పెట్రోల్ ట్యాంకర్ రోడ్డుపై వెళ్తుండడంతోనే ఒక్కసారిగా దానిపై కనిపించిన మంటలను చూసి స్థానికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే అతను పక్కకు వెళ్లి ఆపి చూడడంతో ఆకస్మాకంగా మంటలు పక్క ట్యాంకర్లకు సైతం అంటుకున్నాయి. వెంటనే చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సకాలంలో ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేశాయి. లేదంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు.

**మైలార్‌దేవ్‌పల్లిలో ఘటన..**

**అత్తాపూర్, మే 18, ప్రభాతవార్త:**

షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మూడంతస్తుల భవనంలో స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు కథనం ప్రకారం.. మొఘల్ కాలనీలో జీప్లస్ మూడంతస్తుల భవనంలోని ఓ ఫ్లాట్ లో అగ్ని ప్రమాదం సంభవించి భారీగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ఫ్లాట్‌ఓనర్స్ ఫైర్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేయడంతో వెంటనే చాంద్రాయణగుట్ట ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. అయితే ప్రమాదం జరిగిన భవనంలో ఆరేడు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఘటన సమయంలో పదిమంది భవనంలో ఉండడంతో వారిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా కిందికి దింపారు. ఎలాంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఘటనపై సంప్రదించగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి ఈ ప్రమాదం జరగలేదని చెప్పడం గమనార్హం.


మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన అగ్నిప్రమాదం

## నేడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట ముఖ్య నాయకులో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించబోతు న్నట్లు కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజర్ రమణ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ సుందరయ్య స్మృతిలో ఆయన ఆశయాలను కొనసాగించడానికి 1987 సంవత్సరంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిం దన్నారు. విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ వంటి వాటిలో కేంద్రం ద్వారా నిర్వహిస్తున్నామని వివరించారు. 19న ఎస్వీకే ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ రాఘవులు అధ్యక్షతన ఖినేటి రాజకీయాలు భగత్ సింగ్ ప్రాసంగికతఖీ అంశంపై పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ చమన్ లాల్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలో ట్రస్ట్ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా ప్రసంగిస్తారని తెలిపారు. సభ అనంతరం భగత్ సింగ్ పై ఏకపాత్రాభినయం, నాటిక, సుందరయ్య పై రాసిన పాటలకు నృత్య ప్రదర్శన ఉంటుందని, ఆటలు వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానం జరుగుతుందని వివరించారు.

తెలంగాణ సంప్రదాయాలు పండుగలలో

## డాక్టర్ అంబేద్కర్ విద్యాసంస్థల ప్రతిభ

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల విద్యార్థులు తెలంగాణ సంప్రదాయాలు పండుగలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఉత్తమప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. నటరాజ్ అకాడమీ మరియు అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ డాన్స్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో దాదాపు ఇరవైకి పైగా బృందాలు పాల్గొనగా డా బి ఆర్ అంబేద్కర్ విద్య సంస్థల విద్యార్థులు తమదైన ప్రత్యేకతను నిలుపుకుని ఉత్తమ డాన్స్ ఐకాన్ అవార్డుని గెలుచుకున్నారు. శుక్రవారం ఈ సందర్భంగా విద్య సంస్థల కరెస్పాండెంట్ జి.సరోజా వివేక్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులని అభినందించారు. కార్యక్రమంలో నటరాజ్ అకాడమీ ఫౌండర్ నల్ల గిరి, అక్షిత ఫౌండేషన్ ఫౌండర్ బిట్టు, డాన్స్ మాస్టర్ నవీన్ సుంకరి పాల్గొన్నారు

## మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** చిక్కడపల్లి, నల్లకుంట తదితర ప్రాంతాలలో ఆదివారం అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ యట్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నళిని మోహన్, బుచ్చిరాజు ఆధ్వర్యంలో వేసవిని పురస్కరించుకుని చలివేంద్రం ప్రారంభించారు. వాహన దారులకు, బాటసారులకు బస్సులో వెళ్ళేప్రయానికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సేవా కార్యక్రమంలో భాగంగా వీటిని పంపిణీ చేసినట్టు బుచ్చిరాజు వివరించారు.

# మడిగెలను అందించాలి..మున్సిపల్ ఆదాయాన్ని పెంచాలి

## బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

**జహీరాబాద్, మే 18, ప్రభాతవార్త:** పట్టణంలోని జాతీయ రహదారి పక్కలో నిర్మించిన సమీకృత సముదాయ భవన మడిగెలను వ్యాపారులకు (లబ్దిదారులకు) అందించి మున్సిపల్ ఆదాయం పెరిగేలా చొరవతీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో 11 కోట్ల ఎస్‌డిఎఫ్ నిధులతో 67 దుకాణాలతో నిర్మించిన సమీకృత భవనాన్ని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు 27 డిసెంబర్ 2022న ప్రారంభించినట్లు గుర్తు చేశారు. గుత్తేదారుకు గత ప్రభుత్వ హయాంలోనే 7 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. లక్షల రూపాయల డిపాజిట్ తీసుకుని 53 దుకాణాలను వేలం ద్వార వ్యాపారాలు చేసుకునేందుకు వ్యాపారులకు కేటాయించారన్నారు. 23 ఫిబ్రవరి 2024న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా పురపాక సమీక్ష సమావేశంలో గుత్తేదారు నుంచి కలెక్టర్ సమక్షంలో దుకాణాల తాళాలను మున్సిపల్ కమిషనర్‌కు అందించారన్నారు. 15 మాసాలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు వేలంలో దుకాణాలను దక్కించుకున్న వారికి వ్యాపారాలు చేసుకునేలా అవకాశాలు కల్పించకపోవడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. వ్యాపారులకు దుకాణాలు కేటాయించకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి గడిపడటంతో పాటు వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి లబ్దిదారులకు దుకాణాలు కేటాయించాలని, లేదంటే వ్యాపారులు అందచేసిన డిపాజిట్లను వడ్డీతో కలిసి తిరిగి చెల్లించాలని సూచించారు. అధికారులు స్పందించకుంటే బిఆర్ఎస్ హయాంలో ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు నామ రవికిరణ్, బిఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, తులసీదాస్‌గుప్తా, అశం, మజ్జిగ విశ్వేశర్, అప్పిరాజు, శంకర్, నిఖిల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

# ఉపాధి హామీ... సౌకర్యాల లేమి...

## కొరవడిన అధికారుల పర్యవేక్షణ

**చిన్నశంకరంపేట, మే 18, ప్రభాతవార్త:**

వలసలను నివారించేందుకు ఏర్పాటైన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనిస సౌకర్యాలు కరువయ్యాయి. ఉపాధి హామీ చట్టం ప్రకారం.. పని ప్రదేశంలో కూలీలకు నిలువ నీడ కల్పించడంతోపాటు తాగునీరు ప్రథమచికిత్స కిట్లు అందచేయాల్సి ఉన్నా అవి అమలుకు నోచుకోవడం లేదు. దీంతో కూలీలు ఎండలో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఉపాధి హామి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉన్న మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నశంకరంపేట మండల పరిధి కామారంలో ఉపాధి కూలీలు తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత ఉండటంతో కాసేపు సేద తీరడానికి నీడ కల్పించాల్సి ఉండగా ఏ గ్రామంలో కూడ ఏర్పాట్లు చేయడంలేదు. తాగడానికి సొంతంగా నీటిని డబ్బాలలో తెచ్చుకుంటున్నామని అన్నారు. రెండు వారాలుగా పనిచేసిన ఉపాధి డబ్బులు ఖాతాలలో జమ కాలేదని, ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కూలీలు కోరతున్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి కూలీల పరిస్థితి ఇలానే ఉంది. ఈ విషయమై ఏపివో రాజ్‌కుమార్‌ను 'వార్త' వివరణ కోరగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బందికి తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించి కూలీలకు తగిన సౌకర్యాలను కల్పించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కూలీచేసిన డబ్బులు త్వరలోనే వారి ఖాతాలలో జమ అవుతాయన్నారు. ఉపాధి కూలీలు ఆందోళన చెందవద్దన్నారు.


ఎండలో ఉపాధి హామి కూలీలు


రాజగోపురాని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, మే 18 ప్రభాతవార్త:** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మరోసారి దైవభక్తిని చాటుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 200కు పైగా దేవాలయాలను సొంత నిధులతో నిర్మించడంతోపాటు పురాతన ఆలయా లను జీర్ణోద్ధారణ చేస్తున్నారు.తాజాగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజక వర్గం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని జీవి గుట్ట కాలనీలో నూతనంగా నిర్మించిన రాధాకృష్ణ దేవాలయం రాజగోపురం నిర్మాణానికి 27 లక్షల భారీ విరాళం అందించారు. ఆదివారం ఉదయం స్థానిక ఆలయ కమిటీ ప్రతినిధుల తో కలిసి రాజగోపురాన్ని ఆయన ప్రారంభించారు. భవిష్యత్తులోనూ దేవాల యం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్ప నగేష్,మాజీ కౌన్సిలర్ బాశెట్టి కృష్ణ, నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

**కొమురవెల్లి, మే 18, ప్రభాతవార్త :** మండలకేంద్రంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన శిబిరంలో 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 65 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శస్త్రచికిత్సలు అవసరం ఉన్న వారికి ఉచితంగా చికిత్సలు చేయిస్తామని బిఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుల రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, క్రీడాకారులకు, పేదలకు ఎన్నో సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూరులో కుళ్లిన మాంసం విక్రయం

### -బుధవారం కోసిన మేక తలను ఆదివారం విక్రయం

### -ప్రజల నిలదీతతో నిజం ఒప్పుకున్న యజమాని

**చౌటకూరు, మే 18, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో కుళ్లిన మాసం విక్రయాలు జరుపుతూ ప్రజలు అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఆరెకటికె ధన్‌రాజ్ గ్రామలోని అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేసుకున్న దుకాణంలో మాసం విక్రయిస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన బైరు కిరణ్ దుకాణ సముదాయానికి చేరుకుని మేక తలకాయ ఉందా అని ధన్‌రాజ్‌ను అడగగా ఉందంటూ మేక తలకాయను చూపిస్తూ 7వందల రూపయాలు చెల్లించాలని చెప్పడంతో బైరు కిరణ్ డబ్బులు చెల్లంచి మేక తలకాయను చేతితో పట్టుకుని పరిశీలించగా మేక తలకాయ మెత్తగా ఉండటాన్ని గమనించి తలకాయ పూర్తిగా కుళ్లిపోయి కానవచ్చింది. కుళ్లిన మాంసాన్ని విక్రయిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నావంటే యజమాని ధన్‌రాజ్‌ను బైరు కిరణ్ నీలదీయడంతో ఈ నెల 14న మేకకు కోశామని ఒప్పుకోవడంతో అక్కడికి చేరుకున్న ప్రజలు యాజమాని ధన్‌రాజ్‌ను నిలదీస్తూ మాంసం దుకాణాన్ని మూసేయాలని లేకుంటు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోతామని హెచ్చరించారు.

### గుల్జారా హౌస్ వద్ద ఉన్న భవనంలోని

## బాధితులకు తక్షణ సహాయం అందించాలి

**బేగంపేట మే 18,ప్రభాతవార్త :** గుల్జారా హౌస్ వద్ద ఉన్న భవనంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన బాదితులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని చెక్కల కాంచనమాల విజ్ఞప్తి చేసారు.ఈ ఘటనలో 17మంది మృతి చెందారని,మృతుల్లో ఇద్దరు చిన్నారులు,నలుగురు మహిళలు ఉన్నారని,ప్రమాదంతో భవనంలో ఉన్న పలువురు శ్వాస ఆడక స్పృహ కోల్పోయారని,వారందరినీ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంచన మాల అన్నారు.ఈ ఘటన లో చనిపోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

## సార్వకాలీనతకు చిహ్నం చలం రచనలు

### ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి

**రవీంద్రభారతి, మే 18 ప్రభాతవార్త :** చలం రచనలు చేసిన 8దశాబ్దాల తర్వాత ఇప్పటికీ ఆయన రచనలను గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనల సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చునని ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభలో హాజరైన ప్రముఖులు ముందుగా చలం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి చలం స్త్రీ, ప్రేమలేఖల గ్రంథాలపై నెల్లుట్ల రమాదేవి ప్రసంగిస్తూ ఉన్నతమైన స్వచ్ఛమైన షరతుల్లేని ప్రేమను వ్యక్తంచేస్తూ చలం ప్రేమలేఖలు వ్రాసారని, ఇందులో కొన్ని వ్యక్తులకు రాసినవైతే మరికొన్ని ఊహామూర్తులకు వ్రాసినవని, గొప్ప ప్రేమలేనిదే ప్రేమలేఖలు వ్రాయలేరని చలం అంటాడని ఆమె తెలిపారు. ప్రేమలేఖలు పుస్తకం చదవడం ఒక అద్భుతమైన అనుభవమని రమాదేవి అభిప్రాయపడ్డారు. అనంతరం కె.ఎన్.మల్లీశ్వరి చలం స్త్రీ, ప్రేమలేఖల గ్రంథాలపై ప్రసంగిస్తూ కామం, మోహం వేరని, స్త్రీ పురుషుల మధ్య మోహం లేకపోతే ఆ పెళ్లి విచ్ఛిన్నం అయినట్లేనని అన్నారన్నారు. మోనోగమీ ఆదర్శం కానీ వ్యక్తిగతంగా రకరకాల కారణాల వల్ల అది సాధ్యం కాదని, అందం, గుణం, తెలివి, మృదుత్వం, క్రీడలు, సమర్థత, రసికత, మానసిక అనుభూతి, అర్థంకాని ఆత్మాకర్షణ ఉంటాయని ఇవి సంఘనీతికి అందవన్నారని పేర్కొన్నారు. చలం భావన కన్వీనర్ డా. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ తెలుగు అక్షరంమీద అచంచల ప్రభావం వేసినవాడు చలం అని, చలం రచనలకు వెన్నుముక స్త్రీ వ్యాస సంపుటమన్నారు. అలాగే ప్రేమలేఖలు కూడా స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్త్రీ పురుష సమానత్వాన్నీ ఏ ఆధిపత్యాలులేని జీవితం స్త్రీ గడపాలని చలం ఆకాంక్షించారని తెలిపారు. మనుధర్మాల స్థానంలో స్త్రీ స్వేచ్ఛ రావాలనేది మనం గ్రహించాలని, ఆర్థిక స్వాతంత్ర్యం లభించిన తర్వాత స్త్రీకి విద్య అవసరమని అన్నారు. చలం స్త్రీ పురుషుల సంబంధాల్లో పునాదిని ప్రశ్నించే రచనలు చేశారని, స్త్రీ పురుషులు దంపతులు కావాలంటే సంపూర్ణస్వేచ్ఛ ఉండాలని, ప్రేమబంధాలే కానీ అధికారాంక్షలు ఉండరాదని చలం అన్నాడని నాళేశ్వరంశంకరం వివరించారు. ఈ సభలో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి తదితర రచయితలు పాల్గొన్నారు. చివరిగా చలం స్త్రీ, ప్రేమలేఖలలోని కొన్ని ముఖ్యభాగాలను పలువురు రచయిత్రులు వినిపించారు.


చలం చిత్రపటానికి పుష్పాంజలితో నివాళులర్పిస్తున్న నాళేశ్వరంశంకరం, నందినిసిధారెడ్డి, మల్లీశ్వరి, రమాదేవి తదితర రచయిత్రులు



మంచి నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

## తాగునీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే

**కొంపల్లి, మే 18, ప్రభాతవార్త :** కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 'జయదర్శిని ఎంక్లేవ్'లో నూతనంగా ఏర్పాటుచేసిన మంచి నీటి సరఫరాను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, వెలుస్తున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా జయదర్శిని ఎంక్లెవ్ నందు నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించామన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ మున్సిపల్ ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్లు పూజారి వసంతలక్ష్మణ్ గౌడ్, జంధా కుమార్, నాయకులు చింతల దేవేందర్ యాదవ్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండల్ రావు, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ చిన్నా రెడ్డి, కోశాధికారి కృష్ణ కిషోర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కోలన్ శ్రీనివాస్‌రెడ్డి

**నిజాంపేట్, మే 18, ప్రభాతవార్త :** 26వ వార్డు ప్రశాంతి హిల్స్ అపార్ట్‌మెంట్ నివాసితులు 4 సంవత్సరాలుగా డ్రైనేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించి ఆయన అధికారులతో మాట్లాడి కొత్త డ్రైనేజ్ పైపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆదివారం ప్రశాంతి హిల్స్ వాసులు అభినందన సభను ఏర్పాటు చేసి కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాడి మహేష్‌గుప్తా, నారాయణరెడ్డి, రామచంద్రనాయక్, లింగాల గంగాధర్, మోలేశ్వరరావు, మేకల బాలకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, బాల కృష్ణ, ప్రశాంత్‌రెడ్డి, గౌస్, శ్రీనివాస్ రాజు(మీసాల రాజు), శివ నాగరాజు యాదవ్, బి శ్రీనివాస్, ప్రశాంతి హిల్స్ నివాసితులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత జాగరణ్



పూజల్లో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**కంటోన్మెంట్, మే 18ప్రభాతవార్త :** సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్ లో శనివారం రాత్రి భక్తి శ్రద్ధలతో దుర్గామాత జాగరణ్ నిర్వహించారు. మా వైష్ణోదేవి జాగరణ్ మండల్ ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాల నుండి దుర్గామాత జాగరణ్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. శనివారం రాత్రి నిర్వహించిన జాగరణ్‌లో మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేందర్ జోషి, అరుణ వాల్య, రాంనివాస్ బన్సాల్, పీయూష్ గుప్తా, నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధత శిక్షణకు నిదర్శనం 'రాగతరంగిణి'



గురు తరంగిణిని సత్కరిస్తున్న రమాప్రభ తదితరులు

**నాంపల్లి, మే 18 ప్రభాతవార్త :** శాస్త్రీయ సంగీత శిక్షణలో ఎంతో నిబద్ధతతో శిష్యులకు సమర్ధవంతమైన సంగీతాన్ని నేర్పిస్తూ గొప్ప సంగీత కళాకారులుగా తీర్చిదిద్దుతున్న రాగతరంగిణి సంగీత పాఠశాల గురు తరంగిణి కళాసేవను ఆంధ్ర మహిళాసభ సంగీత కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి డా. ఎర్రమిల్లి రమాప్రభ ప్రశంసించారు. రాగ తరంగిణి మ్యూజిక్ స్కూల్ సంగీత వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమాప్రభ గురు తరంగిణి శిష్యులు శాన్వి సిద్ధి, ప్రేక్షారెడ్డి, శ్రేష్ట బైరెడ్డి తదితరులు ఎంతో శ్రావ్యంగా ఆలపించిన కర్ణాటక సంగీతాన్ని అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆలపించిన మహాగణపతిం, అన్నమాచార్య, శ్రీత్యాగరాయస్వామి కీర్తనలు, దేవిస్తుతి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వాద్యసహకారంలో భాగంగా మృదంగంపై డా. ఆర్. శ్రీకాంత్, వయోలిన్‌పై పవన్‌సింగ్‌లు అద్భుత సహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ సందర్భంగా గురు తరంగిణిని ఘనంగా సత్కరించారు. తరంగిణి రామరాజు వందన సమర్పణతో సంగీత వార్షికోత్సవం విజయవంతంగా ముగిసింది.

## తిరంగ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్

**కంటోన్మెంట్, మే 18 ప్రభాతవార్త:** ఆపరేషన్ హిందూర్ విజయం నేపథ్యంలో శనివారం రాత్రి ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన తిరంగ ర్యాలీలో పాల్గొన్న మలాజ్‌గిరి ఎంపీలు ఈటల రాజేందర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలకు మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తిలకం బొట్టు పెట్టి తిరంగ ర్యాలీకి ఆహ్వానించారు. భారత సైన్యానికి దేశ మంతా ఏకమై అభినందనలు తెలుపుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన తిరంగ ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులకు, బిజెపి ముఖ్య నాయకులకు మోండా డివిజన్ కార్పొరేటర్ తిలకం అందజేసి ఆహ్వానించారు.



ఎంపి ఈటలకు తిలకం పెడుతున్న కార్పొరేటర్ కొంతం దీపిక

# మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి నేతల ఘన నివాళి

**ఉప్పల్, మే 18 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కీసరలోని బండారి సోదరుల వ్యవసాయ క్షేత్రంలో జరిగిన మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. మాజీ మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, డా.రాజయ్య, ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఆకుల రాజేందర్, బిజెపి నేత తూళ్ల వీరేందర్‌గౌడ్, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, ఉప్పల శ్రీనివాస్‌గుప్త, మాజీ ఎమ్మెల్సీ కెవిపి రామచంద్రరావు, కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, శాంతి సాయిజెన్ శేఖర్, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, పన్నాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, పలువురు పార్టీనేతలు పాల్గొని బండారి రాజిరెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చేసిన సేవలు అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి కోసం పాటుపడ్డారని తెలిపారు. ఉప్పల్ భగాయత్ రైతులకు ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన కుటుంబానికి ఉప్పల్ ప్రాంతవాసులతో ఎంతో అనుబంధం ఉందని, ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీల నేతలు పాల్గొన్నారు.



బండారి రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపి ఈటల, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు



ఉప్పల్ మినీ శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

**ఉప్పల్, మే 18 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కళాభూమి ది డిస్టెనేషన్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు మధుసూధన్, మోహన్‌రెడ్డి శిష్య బృందంచే కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మూషిక వాహన, శ్రీ విఘ్నరాజం భజే, అష్టలక్ష్మి, నమశ్శివాయతే, చూడరమ్మ, మహేశ్వరి మహాకాళి, వినాయక కౌతం, గజవదాన, భజరే గోపాలం, జత్విస్వరం, రామాయణ శబ్దం,దేవం దేవ భజే అంశాలను కళాకారులు ప్రణవి, తన్వి, హేతిక, మైదిలా, ఆర్వీ, ఆడవిత, వైభవి, శ్రీనిజ, ధ్రువ్వి, రిత్విక, కీర్తిక, రిదిమా, మోక్షిత తదితరులు ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు.

## ఎంపి గడ్డం వంశీకి ఆహ్వానం అందించకపోవడం బాధాకరం

### మాల మహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అధ్యక్షుడు తల్లమల్ల హసేన్

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొన్న ప్రారంభమైన సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవానికి పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకి ఆహ్వానం ఇవ్వకపోవడం బాధాకరమని మాల మహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పూర్వ సహాయ ప్రభుత్వ న్యాయవాది తల్లమల్ల హసేన్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ, ఈ విషయంపై అవమానంగా భావిస్తున్నామని, స్థానిక ఎంపీ గడ్డం వంశీకి జరిగిన అవమానం తామంతా దళిత జాతికి అవమానంగా భావిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ప్రొటోకాల్‌పై అవగాహన ఉంటుందని కానీ నిర్లక్ష్యం చేసినట్టుగా అర్థమవుతుందని చెప్పారు. ఈ విషయంలో మంత్రితో పాటు దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ బాధ్యత వహించాలని, ఎంపీకి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్‌ను పాటించని విషయంలో సరైన సమాధానం చెప్పకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి గిడ్ల పరంజ్యోతి రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతొట్టి కాంతయ్య, బండి అశోక్, రాష్ట్ర కార్యదర్శి బేగరీ శివరాజు ,దాసరి దేవయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామర్ల జానయ్య, అన్నంపల్లి ఎల్లన్న తెలంగాణ జిల్లాల బాధ్యులు బోయిల అఖిల్, దండు రాజు, దేవి దాసు నీలగిరి రాజు, కట్ట దుర్గాప్రసాద్, గుంటేటి వీరభద్రం పల్లా రాజశేఖర్, గుమ్మడి కనకరాజు ముల్ల గిరి కాంతయ్య సామరాజు మన్నె కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ ఫిలిం అవార్డులను అడ్డుకుంటాం

### తెలంగాణ సినిమా వేదిక హెచ్చరిక

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** గద్దర్ ఫిలిమ్ అవార్డులను తెలంగాణ సినిమాలకు ఇవ్వకపోతే అడ్డుకుంటామని తెలంగాణ సినిమా వేదిక(టిసివి) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఆదివారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో టిసివి గౌరవ సలహాదారు, రాష్ట్ర కన్వీనర్ ప్రొఫుల్‌రాంరెడ్డి, రాష్ట్ర కోకన్వీనర్ మోహన్ బైరాగిలు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడి పదకొండు ఏండ్లు గడుస్తున్నా ఆ ప్రాంతం సినిమా రంగంపై ఆంధ్రాసినిమా పెద్దల ఆధిపత్యం కొనసాగుతూనే ఉందని, పేరుకే తెలంగాణ ఫిలిం ఛాంబర్‌గా ఉందని, ఫిలిమ్ అవార్డులు ఆంధ్రఫిలిమ్ ఛాంబర్ నిర్వహించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం లేదని, థియేటర్లను మాఫియా నడిపిస్తోందని, తెలంగాణ సినిమా రంగం ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలినన పరిష్కరించాలని, గద్దర్ ఫిలిం అవార్డులు తెలంగాణ సినిమాలకు ఇవ్వకపోతే అవార్డు కార్యక్రమాన్ని అడ్డుకుంటామని మరోసారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిసివి నేతలు రవి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకటనల టెలివిజన్‌ను చోరీ చేసిన ఇద్దరిపై కేసు నమోదు.

**బేగంపేట, మే 18,ప్రభాతవార్త :** పరేడ్ గ్రౌండ్స్ మెట్రో స్టేషన్ లో నుంచి విలువైన ప్రకటనల టెలివిజన్(టీవీ)ని చోరీచేసిన ఇద్దరిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు.ఎస్సై ఆర్.జయచందర్ తెలిపిన వివరాల ప్రకారం పరేడ్ గ్రౌండ్స్ మెట్రో స్టేషన్‌లోకి గడచిన నెల 19వతేదీన ఉమామహేశ్వర్, అశోక్ అనే ఇద్దరు టెక్నిషియన్స్ పనిచేసేందుకు అనుమతితో వచ్చారు.అయితే స్టేషన్ కంట్రోలర్‌కు తెలియకుండానే స్టేషన్‌లోని ఓడీయూ గదిని యాక్సెస్ చేసారు.అందులోని స్కైవర్త్ టీవీ సెట్‌ను ఊడదీసుకుని పోయారు.ఈ సంఘటన మొత్తం స్టేషన్ సీసీ టీవీ కెమెరాల్లో రికార్డైంది.టీవీ చోరీ అయిన విషయాన్ని గుర్తించిన మెట్రో అధికారులు,అంతర్గత విచారణ అనంతరం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసారు.ఉప్పల్ మెట్రో డిపోలో పనిచేస్తున్న కృష్ణా దర్శిని ఫిర్యాదు మేరకు శనివారం బేగంపేట పోలీసులు ఉమామహేశ్వర్, అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేసారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బోర్డు మెంబర్ బానుక నర్మద

## కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : బానుక నర్మద

**కంటోన్మెంట్, మే 18 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. ఆదివారం లాల్ బజార్ చౌరస్తాలో రూ.45 లక్షల వ్యయంతో తలపెట్టనున్న బిటీ రోడ్డు నిర్మాణం పనులను ఆమె ప్రారంభించారు. ఈ సంధ్బంగా బానుక మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. 7వ వార్డులోని లాల్ బజార్ చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం మీదుగా మార్కెట్, తిరుమలగిరి సబ్ స్టేషన్, గన్‌రాక్ పంప్‌హౌజ్ వరకు బిటీ రోడ్డు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ఎంపీ ఈటెల సహాయ సహకారాలతో కంటోన్మెంట్ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాగేందర్, ప్రతినిధులు వై.వి.రావ్, బానుక మల్లికార్జున్, సాయి, సురేశ్, శ్యామల రాఘవరెడ్డి, ప్రశాంత్, నర్సింగ్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు ఇవ్వొద్దు

### -మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హసేన్

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున ప్రభుత్వం తొందరపడి ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌లు ఇవ్వొద్దని మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు తల్లమల్ల హసేన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల మహానాడు, షెడ్యూల్ కులాల హక్కుల పోరం తరఫున తెలంగాణ హైకోర్టులో పిటిషన్ పెండింగ్ ఉందని, రెండు వాయిదాల తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖల చేయలేదు, కేసు పెండింగ్‌లో ఉన్నందున ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తొందరపడి ఉద్యోగాల నియామకం గురించి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వరాదని సూచించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు గైడ్లైన్సును సరైన విధంగా పరిశీలించకుండా ఉమ్మడి రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన వర్గీకరణ చేశారని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనుసరించి ఎమ్మిరిటికల్ డేటా చేయలేదని, కోర్టు తీర్పును అనుసరించి అన్ని విషయాలు పరిగణలోకి తీసుకోకుండా దేశంలో తామే మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ చేశామని గొప్పలు చెప్పుకోవడానికి తొందరపడి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేశారన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడ్ల పరంజ్యోతి రావు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరికాంతయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతొట్టి కాంతయ్య బండి అశోక్ మంచాల వెంకటస్వామి రాష్ట్ర ఉపాధ్యక్షులు కామర్ల జానయ్య రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య బేగరి శివరాజ్ మన్నె కృష్ణయ్య వెలుతురు సదానందం బంజ భూమన్న గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బండ వరప్రసాదరావు ప్రధాన కార్యదర్శి బొల్లు సత్యం మాల మహానాడు ఉద్యోగ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల ముక్కంటి జి నర్సింగరావు కట్ట దుర్గాప్రసాద్ సంద యాదయ్య తెలంగాణ జిల్లాల అధ్యక్షులు దేవిదాస్ దండు రాజు బోయిల అఖిల్ గుంటెటి వీరభద్రం సామ రాజు బేకరి గాలయ్య మేదరి నర్సింగరావు తదితరులు ఉన్నారు

## ఫుట్‌ఫాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి హత్య

**బేగంపేట మే 18, ప్రభాతవార్త :** ఫుట్‌ఫాత్‌పై గుర్తు తెలియని ఒక వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన సికింద్రాబాద్ మహంకాళీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంజు థియేటర్ సమీపంలోని జె.కె. ఫర్ని చర్స్ దుకాణం ఎదుట ఫుట్‌ఫాత్‌పై ఉంటున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తి గ్రానైట్ రాయితో తలపై కొట్టి హతమార్చినట్లు పోలీసులు భావిస్తు న్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న మహంకాళీ పోలీసులు హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృత దేహం పక్కనే గ్రానైట్‌రాయి లభ్యం కావడం, దానికి రక్తమరకలు ఉండ టంతో నిందితుడు అదే రాయితో దాడిచేసి ఉంటాడని ప్రాథమిక అంచ నాకు వచ్చారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించిన మహం కాళీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మద్యంమత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందా లేక మరేదైనా కారణమా అన్న కోణంలో పోలీసులు హత్యకుగల కారణాలను అన్వేషి స్తున్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. మహంకాళీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జూపార్కు అభివృద్ధిపై అడ్వయిజరీ కమిటీ సమావేశం

**చార్మినార్, మే 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో శనివారం జూపార్కు మూడవ అభివృద్ధి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాణ ఎలోసింగ్ ఆధ్వర్యంలో జరిగిన జూ పార్కు అడ్వయిజరీ కమిటీ సమావేశంలో జూపార్కు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. జంతువుల మార్పిడి కింద దేశంలోని పలు జూపార్కులకు చెందిన జంతువులను తీసుకురావటం, పచ్చదనాన్ని పెంచడం, జంతువులపై పరిశోధనం చేయటం, వాటర్ ట్రీట్‌మెంట్ ఎస్‌టిపి ఏర్పాటు చేయటంతోపాటు జూ పార్కు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో తీసుకున్నా నిర్ణయాలను జూ పార్కు అండ్ ఆథారిటి కమిటీకి పంపించనున్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాణ ఎలో సింగ్, జూపార్కు డైరెక్టర్ డాక్టర్ సునీల్, ఎస్.హీరామత్, మెట్రో పాలిటన్ జాయింట్ కమిషనర్ హెచ్‌ఎండిఎ శ్రీవాత్సవ కోట, హెచ్‌ఎండిఎ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, సిసిఎంబి ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాపతి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసుదేవరావు, ఎయిమ్స్ బిబినగర్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి, అడిషనల్ డైరెక్టర్ తెలంగాణ యానిమల్ హస్‌బండ్రీ డాక్టర్ మల్లేశ్వరీతో పాటు పలువురు ఉన్నతాదికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాణ ఎలో సింగ్,అధికారులు

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి స్వల్ప అస్వస్తత

**ఉప్పల్, మే 18 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వల్ప అస్వస్తతకు గురైయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అలసటకు గురై కళ్లు తిరగడంతో వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మరణం తర్వాత నిరంతరాయంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని బిజీబిజీగా గడిపిన ఆయన వేసవితాపానికి గురైనట్లు బంధువులు తెలిపారు. వారం రోజులపాటు పలు సంతాప సభలలో ఉదయం నుంచి రాత్రి వరకు బిజీగా పాల్గొని కొంత అలసటకు గురైనట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరిగి దశదినకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. పలువురు పార్టీ నేతలు బండారి లక్ష్మారెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు.

## దాసాంజనేయ స్వామి దేవాలయానికి మైక్ సెట్ అందజేత

**కెపిహెచ్‌బి కాలనీ, మే 18, ప్రభాతవార్త :** కూకట్‌పల్లిలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అనుబంధాలయం శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానానికి కూకట్‌పల్లి వాస్తవ్యులు పోలోజి పవన్ కుమార్ స్వరూప దంపతులు 80 వేల రూపాయల స్టీరియో మైక్ సెట్ అందజేశారు. కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ద్వారా శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానానికి ఆదివారం అందజేసినారు. ఈ సందర్భంగా దంపతులను ఎమ్మెల్యే కృష్ణా రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తులసిరావు కే. సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 18, ప్రభాతవార్త :** మురికివాడలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. రీచ్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బి.పి, షుగర్ వంటి అన్ని జనరల్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్న రీచ్ హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య నిపుణులు అందిస్తున్న సలహాలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సమ్మారెడ్డి, డా.రామకృష్ణంరెడ్డి, డా.సృజనరెడ్డి, డా.అమిత్, బి.వెంకటేష్‌గౌడ్, పోశెట్టిగౌడ్, సురభి రమేష్ రావు, విష్ణువర్ధన్ రెడ్డి, గోవర్ధన్, శ్రీశైలం, రఘు తదితరులు పాల్గొన్నారు.

## దివంగత ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి బన్నాల గీత నివాళి



రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్

**ఉప్పల్, మే 18 ప్రభాతవార్త :** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ఆమె మాట్లాడుతూ స్వర్గీయ బండారి రాజిరెడ్డి సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొక్కొండ జగన్, బింగి శ్రీనివాస్, బాలు, పుష్పరాజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కానాజిగూడలో మజ్జిగ పంపిణీ

**కంటోన్మెంట్, మే 18 ప్రభాతవార్త:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఏటా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కేకేవారి యార్ టేక్ వెండో అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం కంటోన్మెంట్‌లోని డయిరీఫాం రోడ్డు కానాజిగూడలో ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవిలో మజ్జిగ పంపిణీని నిర్వహిస్తున్నామన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

**బేగంబజార్, మే 18 ప్రభాతవార్త:** తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలయన్స్ హైటెక్ జూనియర్ కళాశాలలో ఈసారి ఉత్తమ ఫలితాలను సాధించినట్లు రిలయన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ టి.జితేందర్‌సింగ్ తెలిపారు. విద్యార్థులకు ప్రతిభ పురస్కార అవార్డులను అందచేసినట్లు తెలిపారు. ట్రస్మా ఆసిఫ్‌నగర్ గౌరవ అధ్యక్షులు గాలయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉండి తల్లిదండ్రులను,గురువులను గౌరవిస్తూ ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు.రవికమార్ మాట్లాడుతూ రిలయన్స్ హైటెక్ జూనియర్ కళాశాల ఉన్నతమైన విద్యాకు నిలయమన్నారు. టి.నిషాసింగ్ కళాశాలలో ఉన్నతమైన సౌకర్యాలు,ఉన్నత ప్రమాణాలను వివరించారు. అనంతరం విద్యార్థులను, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ప్రిన్సిపల్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సంపాదించిన శేషగిరి రావు

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** ప్రముఖ గాయకుడు టీవి శేషగిరి రావు 12 గంటల పాటు 120 పాటలు పాడి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కళాభారతి సిటీ కల్చర్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాభారతి సిటీ కల్చర్ సెంటర్ అధినేత పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ, శేషు గానం వినోదానికి కాదు.. వినయానికి ప్రతీక," అన్నారు.ఆయన పదవిలో ఉన్నప్పుడు నీటిని ప్రవహింపజేశారు, ఇప్పుడు స్వరాన్ని ప్రవహింపజేస్తున్నారు," అని ఆయన పేర్కొన్నారు. ఈ గానం నాకు అభిరుచి కాదు, బాధ్యత," అని శేషగిరి రావు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధినేత వెంకటాచారి, ప్రతినిధి అశోక్ కుమార్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## కన్నులపండువగా సాగిన శృంగార రథోత్సవం

**చిక్కడపల్లి, మే 18 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు శృంగార రథోత్సవంపై అధిరోహించారు. పాంఛరాత్రాగ శాస్త్రోక్తంగా ఉత్సవాలను ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహానివేదన, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పతాధివాసము, హవనము, భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వెలుపల సాంస్కృతిక కార్యక్రమాలు, లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు.

కాగా బుధవారం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. సోమవారం ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.

## నేడు పూర్ణాహుతి, చక్రతీర్థము

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుందని ఈవో అన్నపూర్ణ వివరించారు. 20న ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది.

అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేద పండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

## పూడూర్‌లో పోచమ్మ, మైసమ్మ తల్లి జాతర



**మేడ్చల్, మే 18, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో శివంపేట పోచమ్మ, మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలుఘనంగా జరిగాయి. జాతర సందర్భంగాగతవారం రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలు, పూజలునిర్వహిస్తున్నారు. అందులోభాగంగా సోమవారం ప్రత్యేకపూజలు, బండ్లు బోనాలు కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలుపెద్ద ఎత్తునవిచ్చేసిఅమ్మవార్లను దర్శించు కునిప్రత్యేకపూజలునిర్వహించిమొక్కులు సమర్పించారు. మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగారెడ్డి విచ్చేసి పూజలు జరిపారు.

## ఐఖ్యతను చాటేందుకే కమిటీల ఏర్పాటు

**జిల్లెడుచౌదరిగూడ, మే.17,(ప్రభాతవార్త):**

బీసిల ఐఖ్యతను చాటేందుకే గ్రామాలలోనూతనబీసి మహిళ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు బీసి సేనా మండల అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల, కాస్లాబాద్ గ్రామాలలో నూతన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా జయశ్రీకాంత్ మాట్లాడుతూ బిసి కులాలకు చెందిన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ప్రభుత్వం బిసిలకు కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనిఅన్నారు. అనంతరం గ్రామకమిటీలను ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. పెద్దఎల్కిచర్ల గ్రామకమిటీ అధ్యక్షురాలిగ ాగుడిసెశోభారాణి, ఉపాధ్యక్షురాలిగావిజయలక్ష్మీ,ప్రధాన కార్యధర్శి గామంజుల,కోశాధికారిగా లక్ష్మీ,క ార్యదర్శిగా నాగమణిలను ఎన్నుకున్నారు. అలాగె కాస్లాబాద గ్రామకమిటీఅధ్యక్షురాలిగాఅరుణ, ఉపాధ్యక్షు రాలుగాఅనిత,ప్రధానకార్యదర్శిగాసుజాత,కార్యదర్శిగా స్రవంతి, మంజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ప్రశాంత్,బాల్‌రాజు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అన్నదానం ప్రారంభించిన ఉద్యమకారులు ఎండి అఫ్జల్‌ఖాన్

**శామీర్‌పేట, మే 18, ప్రభాతవార్త**



శామీర్‌పేటలో అఫ్జల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం పేదల, అనాధల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు ఎండి అఫ్జల్‌ఖాన్ తెలిపారు. ఆదివారం శామీర్‌పేటలో నివాసం వద్ద ప్రతి ఆదివారం పేదల కోసం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఎండి అఫ్జల్‌ఖాన్ ప్రారంభించారు. అయితే పేదల కోసం అనాధలను, నిస్సాహయులను ఆదేకోవటం కోసం, మానసిక సంతృప్తి కోసం అన్నదాన కార్యక్రమాన్ని అఫ్జల్ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఎండి అఫ్జల్‌ఖాన్ తెలిపారు. సమాజంలో పేదలకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని, అందరు ఆదుకోవాల్సిన అవసరం ఉందని, ఈ ఫౌండేషన్ ద్వారా పేదలకు సేవలు అందించటం జరుగుతుందని ఎండి అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. టీచర్ నర్సింహ్మారెడ్డి, ఎండి నిసార్ అమ్మద్‌ఖాన్, ఎండి అజ్మత్, పాల్గొన్నారు.

## దేవాలయ ప్రారంభోత్సవానికి ఎంపి అరుణకు ఆహ్వానం



**షాద్‌నగర్,ప్రభాతవార్త,మే18:**మండలపరిధిలోని వెలిజర్ల గ్రామంలో ఈనెల19 ననిర్వహించే శివాలయ,రామాలయ,నవగ్రహాలు, నాగదేవతలు, బొడ్రాయి,పోతురాజు విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి రావాలంటూవెలిజర్లశివాలయపునర్నిర్మాణ కమిటీ సభ్యుడు మహబూబ్‌నగర్‌ఎంపీడీకేఅరుణనుకలుసుకొని కరపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు. ఇందుకు డీకే అరుణ సానుకూలంగా స్పందిస్తూ వెలిజర్లలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఎంపిని కలిసిన వారిలో శివాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు ఈరమోని రాజు, దొడల వెంకటేష్ యాదవ్, నరేష్, బీజేపీ నాయకులు మేక నరేందర్ రెడ్డి, పాత్లావత్ శ్రీను నాయక్, లష్కర్ నాయక్,మోహన్‌సింగ్, అమీర్‌పేట వెంకటేష్ గౌడ్, గ్రామస్థులు ఎల్లారం సత్తిరెడ్డి పాల్గొన్నార

## ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకోవాలని ప్రచారం

**మేడ్చల్, మే 18, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని నూతనకల్ గ్రామంలో ఉపాధ్యాయులు గ్రామంలో ప్రచారం నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పిస్తూ గ్రామ కూడలిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ప్లెక్సీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచాలని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రచారం చేపట్టారు. ప్రైవేటు వద్ద ప్రభుత్వ పాఠశాలలే ముద్దు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేయండని ప్లెక్సీలో రాయించి అందరిని ఆకర్షించే రీతిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్, రమాదేవి పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో త్రైత సిద్దాంత భగవద్గీత ప్రచారం

**మేడ్చల్, మే 18, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలో వెంకట్రామయ్య కాలనీలో సోమవారం త్రైత సిద్దాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్దాంత భవద్గీత, అనుబంధ త్రైత సిద్దాంత జ్ఞాన గ్రంధాల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమమే విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని వివరించారు. ప్రతి ఒక్కరు కర్మయోగం విశిష్టత, త్రైత సిద్దాంత జ్ఞానం తెలుసుకోవాలని ఈ ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గిరి, సభ్యులు కుమార్, మధు, సర్పింహచారీ, చంద్రకళ, నాగమణి, పద్మ, లక్ష్మీ, పవన్, సుధీర్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నాల్‌లో జరిగిన మహా యజ్ఞహోమం

### ప్రత్యేక పూజలు ప్రారంభం



అనాధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి మహాయజ్ఞం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, మే 18, ప్రభాతవార్త**

పొన్నాల్ గ్రామంలో అనాధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి మహ యజ్ఞహోమం ప్రత్యేక పూజలు ప్రారంభమైనాయి. ఆదివారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామంలోని నారాయణరెడ్డి ఫార్మ్‌హౌస్‌లో ఈ మహాయజ్ఞ పూజలు ప్రారంభించారు. ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మహాయజ్ఞ పూజలు పదిరోజుల పాటు నిర్వహించటం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. లోకకల్యాణం, ధర్మరక్షణ కోసం ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈయజ్ఞంకార్యక్రమానికి సిద్దయోగి శ్రీమాన్ ఆదినారాయణన్, మాతృశ్రీ అనంతలక్ష్మి, కుమారనందగిరి మహారాజ్‌లు పది రోజుల పాటు పాల్గొని ఈ మహాయజ్ఞ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మంజుకేశ్వర్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డిలు సహకరిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మహాయజ్ఞంపూజ శామీర్‌పేట సొసైటీ చైర్మన్,డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మేడ్చల్ యోగా మాస్టర్ కిషోర్, గ్రామపెద్దలు పి.నారాయణరెడ్డి, పి.సతీష్‌రెడ్డి, భక్తులుపాల్గొన్నారు.

## బిటి, సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన..

**దుద్యాల్, మే18, ప్రభాతవార్త:** జిల్లాలోనే దుద్యాల్ మండలం అభివృద్ధిలో ముందంజలో ఉందని దుద్యాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అవుటి శేఖర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామం ఎండి మైసమ్మ గడ్డ తండా వరకు రూ.1 కోటి, 30 లక్షలతో బీటీ, సిసి రోడ్ల నిర్మాణం కొరకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు, గూడెంలో గిరిజన తండాలు మారుమూల ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరుగుతాయని అన్నారు. దుద్యాల్ మండలం అత్యంత వేగంగా అభివృద్ధిలో దూసుకుపోతుందని గుర్తు చేశారు. అందుకుగా ను బీటీ రోడ్లు, సిసి రోడ్లు, పారిశ్రామిక వాడ ఏర్పాటు వంటి అనేక రకాల అభివృద్ధి ప నులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మండలంలో కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి ప నుల ు అధికార యంత్రాంగం కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు. అభివృద్ధి ప నుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటిస్తూ అభివృద్ధి ప నులు సాగుతున్నయని పేర్కొన్నారు. అభివృద్ధి ప నులకు ఎలాంటి అడ్డంకులు కలిగించకుండా మండల అభివృద్ధికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, సీనియర్ నాయకులు సీసీ వెంకటయ్య, సీతారాం నాయక్, పులిందర్ రెడ్డి, కృష్ణ, సత్యనారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, మండల యాదవ సంఘం అధ్యక్షుడుకావలినరసింహులు,మొగులయ్య, రామాంజనేయులు,రాహుల్ పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి పండుగ

**ఘట్‌కేసర్,మే18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో ఆదివారం బొడ్రాయి పండుగ ఘనంగా జరిగింది. దీనిలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బొడ్రాయిని నూతనంగా ప్రతిష్ఠించిన నాభిశిలా బొడ్రాయికి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. డప్పువాయిద్యాలతో బోనాలను ఊరేగింపుగా తెచ్చి నైవేద్యం సమర్పించారు .నాలుగురోజులు నుంచి బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ పట్టణంలో పెద్ద సంఖ్యలో నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్డును లైటింగ్‌లతో అలంకరణ చేశారు. దీనిలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ ప్రత్యేక బోనం సమర్పించారు. బొడ్రాయి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ హెల్త్‌సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపిపిలు బండారి దాసుగౌడ్, బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాదవరెడ్డి, మాజీ సర్పంచు అబ్బసాని యాదగిరియాదవ్, మాజీ ఎంపిటిసి మేకల పద్మారావు, బండారి వసంత, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ ఉపసర్పంచు యాదగిరియాదవ్, సొసైటీ మాజీచైర్మన్ సారశ్రీనివాస్‌గౌడ్, గౌడసంఘంఅధ్యక్షులు మదనగిరి సురేశ్‌గౌడ్, మాజీవార్డుసభ్యులుచిత్తారియాదవ్,నాయకులు బచ్చు నగేశ్‌గుప్త, ప్రమోద్‌గుప్త, జగన్మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, రొడ్డ యాదగిరి, బాలయ్య, కిష్టయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, కులసంఘాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### కులాంతర వివాహాలు చేసుకున్న

# మూడు జంటలకు బ్యాంకు డిపాజిట్ బాండ్ల పంపిణీ

### మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 18, ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం చే కులాంతర వివాహాలు చేసుకున్న మూడు జంటలకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం బ్యాంకులో డిపాజిట్ చేసిన 2,50,000రూపాయల బాండ్లను వారికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి వారికి అందజేశారు. ఆదివారం ఉదయం నగరంలోని బోయినిపల్లిలోని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి క్యాంపు ఆఫీస్‌లో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు (లబ్దిదారులకు) బాండ్లను ఆయన పంపిణీ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిలో అఖిల్–హరిప్రి, బంగారి–అనూష, శరత్‌కుమార్–మీనా మూడు జంటలకు బ్యాంకులో డిపాజిట్ చేసిన రూపాయల బాండ్లను ఎమ్మెల్యే మల్లారెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా ఎస్సీ డవలప్‌మెంట్ ఆఫీసర్ టి.తులసి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు డిపాజిట్ బాండ్లను పంపిణీ చేసిన మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి దృశ్యం

# కళాశాలలో ప్రవేశాలకు గ్రామాల్లో విస్తృత ప్రచారం





తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల



### విద్యార్థులతల్లిదండ్రులు, గ్రామస్తులతో చర్చలు

### తలకొండపల్లి ప్రభుత్వ కళాశాలలో చేరాలని హితవు

**తలకొండపల్లి మే18,ప్రభాతవార్త;**తలకొండపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్ గా విధులు నిర్వహిస్తున్న షణ్ముఖ రెడ్డి పని విధానంపట్ల మండలంలోని వివిధ గ్రామాల ప్రజలుహర్షం వ్యక్తం చేస్తూ అతని పనితీరును అభినందిస్తున్నారు. వివరాలలోకివెళితే రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కావాలంటూ పలు విద్యార్థి, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు గత పది సంవత్సరాలుగా జూనియర్ కళాశాలకోసంఎక్కడ అవకాశం ఉన్న అక్కడ వినతి పత్రాలు, ప్రభుత్వ పెద్దలకువిన్నవించుకోవడంజరిగింది. దీంతోతుదకు దిగివచ్చిన అప్పటి తెలంగాణ బిఆర్ఎస్ ప్రభుత్వం 2023 ఎన్నికల ముందు అప్పటికల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌చొరవచూపితలకొండపల్లిమండలానికిప్రభుత్వజూనియర్‌కళాశాల మంజూరు చేస్తూ త్తర్వులు ఇచ్చింది.దీంతో 2024 విద్యాసంవత్సరం ఆరంభంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు గురించిఎక్కడఎద్దగాతెలియకపోవడంతోఒక్కవిద్యార్థిప్రవేశంతీసుకున్నప్పటికీగతావిద్యార్థులు ఎవరు కళాశాలలో ప్రవేశం తీసుకోక పోవడంతో మంజూరైన కళాశాల మూతబడిపోయింది. కాలేజీకి ఇద్దరు లెక్చరర్స్ ను మంజూరు ఇచ్చినప్పటికీ విద్యార్థులు లేక ఆ లెక్చరర్స్ ప్రతిరోజు వచ్చి వెళ్ళిపోయేవారు. ఆ విధంగా విద్యా సంవత్సరం ముగిసింది. దీంతో విద్య శాఖలోని ఉన్నతాధికారులు 2025 విద్యా సంవత్సరం ఎలాగైనా విద్యార్థులను చేర్పించి కళాశాలను నడిపించాలనే ఉద్దేశంతో నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండల కేంద్రంలోనికళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న షణ్ముఖ రెడ్డిని డిప్యూటేషన్ పై తలకొండపల్లి కళాశాల అడ్మిషన్ డ్రైవ్, లైబ్రేరియన్ గా బాధ్యతలు అప్పగించారు .లైబ్రేరియన్‌గాడిప్టేషన్‌పైవచ్చినజిషణ్ముఖ రెడ్డి తన పని విధానాన్ని మొదలుపెట్టారు. గతంలో రంగారెడ్డి జిల్లా మాడుగుల మండల కేంద్రంలో కొత్తగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడంతో షణ్ముఖ రెడ్డి తన పని విధానాన్ని ప్రారంభించి మండలంలోని అన్ని గ్రామాల తిరిగి విద్యార్థులను అధికంగా చేర్పించి కళాశాలను కాపాడిన అనుభవం ఉంది. ఇదే మాదిరిగా తలకొండపల్లి మండలంలోని పదవ తరగతి పాఠశాలలు ఉన్న గ్రామాలనుముందుగాసందర్శించిపదవ తరగతిలో పాసైన విద్యార్థులవివరాలను వారి తల్లిదండ్రుల వివరాలు ఉపాధ్యాయులతో తెలుసుకొని వారి ఇంటిలోకి వెళ్లి తల్లిదండ్రులతో ముచ్చటించి తలకొండపల్లి ప్రభుత్వకళాశాలలో చేరాలని హితవ్ పలికారు. నిరుపేద ప్రజలకు కార్పొరేట్ కళాశాల ఫీజులవివరాలు, ఇబ్బందుల గురించి వారికి గుచ్చిగుచ్చితెలుపుతూ ప్రభుత్వ కళాశాలలో ఎలాంటి ఫీజులు ఉండవని, ప్రతిరోజు మీ పిల్లలు మీ ఇంటి దగ్గరికేవస్తారని వారికిఎలాంటి ఇబ్బంది ఉండదని,వారితల్లిదండ్రులకు గ్రామస్తులకు వివరిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని గట్టు ఇప్పలపల్లి,చుక్కాపూర్, పడకల్ ,వెల్జాల్, చంద్రధన, జూలపల్లి, ఆరనాయక్ తండ,వెంకటాపూర్ తండా,ఆద్రకుంటతండా, తోపాటు కేశంపేట్ మండలంలోని నిడదవెల్లి, కాకునూరు గ్రామాలలోని విద్యార్థులదగ్గరికివెళ్లివివరించారు.,కానీషణ్ముఖరెడ్డి అందుకు విరుద్ధంగా తనకుఅప్పగించినబాధ్యతలనుతూచాతప్పకుండానెరవేరుస్తూ మండలంలోని వివిద ్వర్గాల ప్రజల నాయకులనుంచి ప్రశంసలుపొందు తున్నాడు. షణ్ముఖరెడ్డి కోసమైన తమ పిల్లలను తలకొండపల్లి ప్రభుత్వ కళాశాలలో చేర్పిస్తామనేరీతిలోవారుచెపుతుండడంగమనార్హం. బస్‌సౌకర్యం కల్పించాలి.తత్వ జూనియం విద్యార్థులు చేరేందుకుకొన్నిగ్రామాల విద్యార్థులకు రవాణా సౌకర్యం లేదని, దీంతో ప్రభుత్వ పెద్దలు గుర్తించి గట్టుపల్ పల్లి,పడకల్ జంగారెడ్డి పల్లి, మెదక్‌పల్లి, గ్రామాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



## ప్రభుత్వఆసుపత్రిలో ఆధునిక పద్దతులతో దంత చికిత్సలు

**..మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి**

**మేడ్చల్‌జిల్లా ప్రతినిధి, మే 18, ప్రభాతవార్త**జిల్లా పరిధిలోని మల్కాజ్‌గిరి ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో దంత చికిత్సలు అత్యాధునిక పద్దతులతో నిర్వహించబడుతున్నట్లు, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి సూచించారు. ఆ పిహెచ్‌సి దంత వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్ నైపుణ్యం, సేవాభావానికి నిదర్శనం అని ఆమె ప్రశంసించారు. జిల్లా ప్రజలు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వరంగంలోనూ నాణ్యమైన దంత చికిత్సలుఅందుబాటులోఉన్నాయన్నవిషయాన్నిఆమెజిల్లా ప్రజలకు గుర్తు చేశారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని మల్కాజ్‌గిరి ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో దంత చికిత్సలలో నూతన పద్దతులతో ముందడుగు కొనసాగుతుంది. దంత చికిత్సా విభాగం ప్రగతి పథంలో ముందుకు వెళుతుంది. అయితే ప్రతి రోజు మల్కాజ్‌గిరి పిహెచ్‌సిలో అత్యాదునిక దంత వైద్య విభాగం అభివృద్ధి చెందుతుంది. ప్రజలకు అధునాతన శస్త్ర చికిత్సలు అందించటంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ పి.వినోద్ సేవలు ప్రత్యేక గుర్తింపును పొందుతున్నాయి. 27సంవత్సరాలయువకుడు కార్తిక్ రోడ్డు ప్రమాదంలో (ఆర్‌టిఎ) కారణంగా ఎగువ దవడకు బలమైన గాయాలు కావటంతో డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో అత్యుత్తమ సాంకేతికతతో పోస్ట్ కోర్ క్రౌన్ పిన్ ఫిక్సేషన్ చేయటం జరిగిందన్నారు. ఎడమపై భాగంలోని లేటరల్ ఇన్సైజర్ పంటికి రూట్ కెనాల్ చికిత్స (ఆర్‌సిటి) విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

### వెలిజర్ల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే18 :** మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, రామాలయం ప్రాపారంభోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభం, నవగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, సభ్యులు అనిమి గణేష్ గౌడ్, దొడల శివకుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాంగారి జంగయ్య, కావలి జగన్, జాంగారి రవి, ముఖంద గౌడ్, సత్యం రెడ్డి, తుప్పరి శేఖర్, కావలి జంగయ్య, కావలి బాలనర్సింహులు, వట్టెల మహేష్ యాదవ్, దొడల శ్రీనివాస్ యాదవ్, మట్ట సురేష్, నరేష్, తమ్మలి బుచ్చయ్య, వేములనర్వ రాఘవేందర్ పాల్గొన్నారు.

### వ్యవసాయఅధికారిగాలావణ్య

**ఘట్‌కేసర్,మే18,ప్రభాతవార్త:**ఘట్‌కేసర్‌మండల వ్యవసాయ అధికారిగా లావణ్య బాధ్యతలు చేపట్టారు. మండల ఏఓ ఎంఏ బాసిత్ ఘట్‌కేసర్ మండలం నుంచి జడ్చర్లకు బదిలీపై వెళ్లారు. జడ్చర్ల నుంచి ఘట్‌కేసర్ మండలవ్యవసాయఅధికారిగాలావణ్యబదిలీపైవచ్చిబాధ్యతలు స్వీకరించారు. రైతులకు అందుబాటులో ఉండి పంటల సూచనలు, సలహాలు ఇస్తూ వ్యవసాయ పద్దతులను మెరుగుపర్చటానికి చర్యలు తీసుకుంటామని, రైతులుపంటల సమస్యలను తమకు తెలియజేయాలని ఆమె సూచించారు.

### నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి..

**-షాద్‌నగర్ రూరల్, మే 18,ప్రభాత వార్త :** వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు నాణ్యమైన విత్తనాలనుమాత్రమే ఎంపిక చేసుకోవాలని షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఇంఛార్జీ ఏడీఏ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతులు పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారని, ఈ తరుణంలో విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని తీసుకోవాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని, అదేసమయంలో తప్పనిసరిగా రసీదులను తీసుకొని పంట కాలం అయిపోయే వరకు వాటిని భద్రంగా దాపెట్టుకోవాలన్నారు. మార్కెట్‌లో పొందిన కంపెనీలకు సంబంధించిన విత్తనాలే కొనుగోలు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుందని, కొంత మంది గ్రామాల్లో తిరుగుతూ రసీద్‌లు ఇవ్వకుండా విత్తనాలను అమ్మడానికి వస్తారని ఇలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని, అదేవిధంగా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని ఆయన అన్నారు.

## దోశలో బొద్దింక,అదే తీరుతో వ్యవహరిస్తున్న రాఘవేంద్ర ఉడిపి హోటల్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే18 :** గత కొంతకాలంగా షాద్‌నగర్ బస్టాండు ఆవరణలో ఉన్న రాఘవేంద్ర ఉడిపి హోటల్‌లో బొద్దింకలు, అన్నంలో వెంట్రుకలు వస్తున్నాయని ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కానీ నేడు ఒక వినియోగదారుడు దోశ ఆర్డర్ చేసి సగం దోశ తిన్న తర్వాత అందులో బొద్దింక ఉందని గమనించి వాంతులు చేసుకున్నాడు. ఈ విషయమై హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా పొంతనలేని నిర్లక్ష్యపు సమాధానాలుచెబుతున్నారనివినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోకూడాఇడ్లీలోబొద్దింక వచ్చిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పటికీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇంతవరకు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం ప్రజలలో ఆగ్రహాన్ని పెంచింది. హోటల్ యజమానులు తమ తప్పును అంగీకరించకుండా, వినియోగ దారుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది ఆరోగ్య ప్రమాదాలను మరింత పెంచుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలను పాటించని హోటళ్లపైఉక్కుపాదంమోపాలనివినియోగారులు కోరుతున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టంగా చర్యలు తీసుకువాలని కోరుతున్నారు.

### జూనియర్ సిపిఎల్ సీజన్5 అట్టహాసంగా ప్రారంభం

**నందిగామ మే 18 ప్రభాతవార్త:**క్రీడలతో మానసిక ఆనందంతో పాటు దేహదారుఢ్యం సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మాజీ ఎంపీపీ ఎం శివ శంకర్ గౌడ్ స్పష్టం ఆదివారం చేగూరు గ్రామంలో సిపిఎల్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై అనంతరం ఆయన మాట్లాడుతూ యువకుల మధ్యస్నేహపూరితవాతావరణాన్ని నెలకొల్పడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. టోర్నమెంట్ నిర్వాకుడు మంకాల శ్రీశైలం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువకుల ప్రతిభ పాటవాలను వెలికి తీసేందుకే చేగూర్లో జూనియర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్‌నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లోగెలుపొందిన జట్టుకు రూ.10,000 నగదు బహుమతితోపాటువిన్నర్‌కప్‌ను రన్నర్ జట్టుకురూ.5,000నగదుఅందజేస్తామన్నారు. వెంకమ్మగూడ మాజీసర్పంచ్ వీరేందర్‌గౌడ్, ఆవులశివ,గుండాల సాములయ్య, బుగ్గశ్రవణ్, వడ్డే శ్రీను, గునుగుర్తి రాజశేఖర్, పబ్బె శ్రీశైలం, అన్నారం నర్సిమ,ఎండి ఖలీద్, పబ్బె రవి, సోలిపేట శ్రీను, జింగ భీమేష్,కందాడ అరవింద్, మంగలి మహేష్, సురేష్, శంకర్, వడ్ల వెంకట్ చారి, తుక్కుగూడ వంశీ, రేనట్ల కార్తీక్, మంగలి వంశీ, గ్రామ పెద్దలు క్రీడాకారులు యువకులు పాల్గొన్నారు.

### బైక్ పై నుండి పడి మహిళ మృతి

**కేశంపేట మే 18 ప్రభాతవార్త.:** కేశంపేట మండల పరిధిలోని మంగళ గూడ గ్రామానికి చెందిన బాలమణి వయసు 40 సంవత్సరాలు కొత్తపేట గ్రామం నుండి మంగళ గూడెం వెళ్లేందుకు బైక్ ను లిఫ్ట్ అడిగి బైక్ పై కూర్చుని వెళ్తుండగా మార్గమధ్యమంలో బైక్ పై నుండి జారిపడి తీవ్ర రక్త గాయాలయ్యాయి, వెంటనే 108కు సమాచారం ఇవ్వగా 108 పైలెట్ రామచందర్ గాయపడిన వ్యక్తిని షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని రామచంద్ర తెలిపారు

### విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి

**ధారూరు,మే18, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి చెందింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పిసిఎం తండాకు చెందిన నే నావత్ రవీందర్ నాయక్ కు చెందిన రైతు తన ఎద్దు ను పొలం వద్దకు మేతకు తీసుకెళ్లాడు. ఈక్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాల ు వదిలింది. ఎద్దు మృతిని తెలుసుకున్న రవీందర్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.50 వేలు వరకు ఉంటుందని తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.